హైదరాబాద్
సోమవారం-16
నవంబర్-2026

పేజీలు-8

balagamtv100@gmail.com

బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/

ఎరుపెక్కిన నల్లగొండ

- ఎర్రజెండాల హోరు.. నినాదాల జోరు..
- రైతు మహాప్రదర్శనతో దద్దరిల్లిన నల్లగొండ.. ఎటుచూసినా ఎర్రసైన్యమే
- నాటి సాయుధ పోరాట స్ఫూర్తి..
- నేడు రైతాంగ మహాప్రదర్శన రూపంలో ప్రతిధ్వని
- దింసా నృత్యాలు.. కోలాటాలు.. చెక్కభజనలు.. డీజే సప్పుళ్లు.. ఎడ్లబండ్ల సందడి
- నాలుగు కిలోమీటర్ల మేర కదం తొక్కిన రైతాంగం.. విప్లవాల ఖిల్లాపై ఎర్రజెండాల ప్రభంజనం



పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు వేగవంతం చేయాలి





- తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల నీటిమట్టానికి మహారాష్ట్ర అంగీకారం ఇప్పించాలి
- ప్రధాని మోదీతో భేటీలో తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులు, నిధులపై సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- ప్రాజెక్టుల అనుమతుల్లో జాప్యం తొలగించాలి
- తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల నీటిమట్టానికి అంగీకారం కోరాం

హైదరాబాద్, నవంబర్ 15 :
ప్రధాని నరేంద్ర మోదీతో తెలంగాణ ముఖ్య మంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి భేటీ అయ్యారు. నవంబర్ 22 వరకు తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు హాజరుకావాలని ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ భేటీలో రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పర్యావరణ అనుమతులు, అంతర్రాష్ట్ర జల వివాదాలు, కేంద్ర నిధులు, భూగర్భ జలాల పరిరక్షణ తదితర అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. భేటీ అనంతరం న్యూఢిల్లీలో సహ చర మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మసాగర్, డిండి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రధానిని కోరి నట్లు ఉత్తమ్ తెలిపారు. ఈ మూడు ప్రాజెక్టులపై గత, ప్రస్తుత ప్రభుత్వాలు కలిపి సుమారు రూ.50 వేల కోట్లు ఖర్చు చేశాయని పేర్కొ న్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చినప్పటికీ పర్యా వరణ అనుమతుల దరఖాస్తుల పరిశీలనలో జాప్యం కొనసాగుతోందని వివరించారు. దేశ వ్యాప్తంగా అనుమతుల కారణంగా నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టుల సమస్యల పరిష్కారానికి ప్రధాని చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల పూర్తిస్థాయి నీటిమట్టం మిగతా 3లో..

ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల గోడుపట్టని సర్కార్



- 8 ఏండ్లుగా ఆర్థిక ప్రయోజనాల పెండింగ్
- 20వేల మందికి తప్పని ఎదురుచూపులు
- రిటైర్డ్ బెనిఫిట్స్ అందక 400 మందికి పైగా మృత్యువాత
- బస్‌భవన్ చుట్టూ తిరుగలేక కోర్టులను ఆశ్రయించిన వైనం
- ఆర్పీఎస్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లు చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్

వివరాలు 2లో..

రూ.5.09 కోట్ల వ్యాపార మోసం.. మహిళపై లైంగిక వేధింపుల ఆరోపణలు

- పెళ్లి పేరుతో వంచించి లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు
- ముంబై నుంచి వచ్చిన జీరో ఎఫ్ఐఆర్‌తో ఆరుగురిపై కేసు

వివరాలు 2లో..

సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలి

- విద్యతోనే సామాజిక పరివర్తన..
- యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యారంగంలో మార్పులు
- తెలంగాణను ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యం
- యంగ్ ఇండియా రెసిడెన్షియల్, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు విద్యారంగంలో గేమ్‌చేంజర్లు:
- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్, నవంబర్ 15 :
ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించడానికే పరిమితం కాకుండా విద్యార్థుల కుటుంబ, సామాజిక పరిస్థితులపై అవగాహన కల్పిస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. విద్య ద్వారానే సామాజిక పరివర్తన సాధ్యమని, తెలంగాణ యువతను ప్రపంచంతో పోటీ పడే స్థాయికి తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆదివారం ఖైరతాబాద్‌లోని ఇంజనీరింగ్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్‌టీఎఫ్) రాష్ట్ర విద్యా మహా సభలను భట్టి విక్రమార్క జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.విద్యార్థుల ఎదుగుదల కేవలం పాఠశాల బోధనపైనే ఆధారపడి ఉండదని, ఇంటి వాతావరణం, పౌష్టికాహారం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు, సామాజిక నేపథ్యం కూడా వారి మేధో వికాసాన్ని ప్రభావితం చేస్తాయని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, మిగతా 3లో..

ధాన్యం రైతుకు యూ‌ప్ దగా!



- బోనస్ ఎగవేతకు సర్కార్ ఉద్దేశపూర్వక జాప్యం
- కొనుగోలు కేంద్రాలు తెరిస్తే నిర్వహణ భారంతో
- పాటు 500 బోనస్ ఇవ్వాల్సి వస్తుందని జాప్యం
- ఇంతవరకు వడ్లగింజ కూడా కొనని ప్రభుత్వం
- నెల రోజులుగా కల్లాలు, కేంద్రాల్లోనే ధాన్యం
- సర్కార్ తీరుతో వడ్లరాశులు దళారులపాలు
- విధి లేక అగ్గువకు అమ్ముకుంటున్న రైతులు

ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో అగ్రగామిగా తెలంగాణ

- డిజైన్, ఇంజినీరింగ్, నాణ్యతా పరీక్షలు, ధ్రువీకరణ, పరిశోధనపై ప్రత్యేక దృష్టి
- హైదరాబాద్‌లో ఎన్‌డీఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సానుకూలం
- 'ఎన్‌డీఈ--2026' జాతీయ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు



వివరాలు 4లో..

ఓడిన రేవంత్ నిరంకుశత్వం

- ప్రభుత్వ మెడలు వంచి గెలిచిన పాలిటెక్నిక్ విద్యార్థులు
- పోలీసు దాష్టీకాలపై ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ డిమాండ్



వివరాలు 2లో..

యువత భవిష్యత్తుకు అండగా బీఆర్ఎస్ : కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 15 :
తెలంగాణ యువత భవిష్యత్తుకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు చెప్పారు. నిరుద్యోగ యువత కష్టానికి తగిన ఫలితం దకాలని, వారు ప్రభుత్వ ఉద్యోగం సాధించి తమ కుటుంబాల ఆశయాలను నెరవేర్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు. వివిధ ప్రభుత్వ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కోసం రూపొందించిన కరెంట్ అఫైర్స్ స్టడీ మెటీరియల్‌ను కేటీఆర్ తన నివాసంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ మెటీరి యల్ విద్యార్థుల ప్రిపరేషన్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగార్థులకు కేవలం మాటలతో భరోసా ఇవ్వడమే కాకుండా, వారి లక్ష్యసాధనకు అవసరమైన విద్యావనరులను అందించే ప్రయత్నం చేస్తున్న బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డిని కేటీఆర్ అభినందించారు. 'యువత విజయం మన లక్ష్యం.. వారి భవిష్యత్తుకు అండగా నిలువడం మన బాధ్యత' అని పేర్కొన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవం ఢిల్లీకి తాకట్టు

- కాంగ్రెస్, బీజేపీ నేతల రాష్ట్రానికి అవమానం
- గాంధీలకు బాడీగార్డులా సీఎం రేవంత్‌రెడ్డి
- అమిత్‌షా చెప్పులు మోసిన బండి సంజయ్
- 'ఎక్స్' వేదికగా కేటీఆర్ తీవ్ర విమర్శలు



హైదరాబాద్, నవంబర్ 15 : కాంగ్రెస్, బీజేపీ నేతలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దలకు తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వారు వ్యవహరించిన తీరు రాష్ట్రానికి తీరని అవమానమని ఆదివారం 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు. టీ కాంగ్రెస్, బీజేపీ నేతల్లో ఉన్నత పదవులకు ఉండాల్సిన హుందాతనం కరువైందని దుయ్యబట్టారు. గాంధీలకు బాడీగార్డులా మిగతా 3లో..

'ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యపై వస్తున్న ఆరోపణల వెనుక కార్పొరేట్ శక్తుల కుట్ర'

- బ్రీసీకి బీసీ సంఘాల సంపూర్ణ మద్దతు
- ఆరోపణలకు ఆధారాలు చూపాలి, నిరాధార ప్రచారం మానుకోవాలి
- బ్రీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్



మిగతా 2లో..

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

భరోసా'కు నిధుల్లేవు.. సమ్మిట్‌లకు కోట్లు ఖర్చా?

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నిలదీత



హైదరాబాద్, నవంబర్ 15 : రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నదని, రైతు భరోసాకు నిధులు లేవని చెప్తూనే.. సమ్మిట్‌లకు మాత్రం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తారా? అంటూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. పంటలు ఎండిపోయి రైతులు అల్లాడుతుంటే క్షేత్రస్థాయికి వెళ్లకుండా, హైదరాబాద్‌లో విందులు, వినోదాలతో సదస్సులు నిర్వహిస్తారా అని నిలదీశారు. ఆరు గ్యారెంటీలు గాలికి వదిలేసి ఆర్భాటపు సదస్సులతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాధనంతో జరిగే ఈ సదస్సుల వల్ల తెలంగాణ సామాన్య ప్రజలకు, రైతులకు ఒరిగేదేమీలేదని ఆదివారం స్పష్టంచేశారు. ప్రజా ధనంతో ప్రచార ఆర్భాటాలు, సదస్సులు నిర్వహించడంకంటే ముందుగా ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా వంటి హామీలకు నిధులు కేటాయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు మరోసారి మాయమాటలు చెప్పి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత ఎన్నికల సమయంలో అర్ధరాత్రి అశోక్‌నగర్ వీధుల్లో తిరిగి నిరుద్యోగ యువతకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ఇస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. మూడేండ్లు గడుస్తున్నా ఆ హామీల అమలు ఎకడికి పోయిందో రాహుల్‌గాంధీ తెలంగాణ యువతకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

దీక్షా దివస్‌కు ఎన్నారైలు సిద్ధంకావాలి

బీఆర్ఎస్ ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల



హైదరాబాద్, నవంబర్ 15 : తెలంగాణ సాధనకు కేసీఆర్ చేపట్టిన చారిత్రక ఆమరణ దీక్షను స్మరించుకుంటూ నవంబర్ 29న నిర్వహించనున్న దీక్షా దివస్‌కు బీఆర్ఎస్ ఎన్నారై శాఖలన్నీ సిద్ధంకావాలని బీఆర్ఎస్ ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల పిలుపునిచ్చారు.ప్రపంచంలోని వివిధ దేశాల్లో నివసిస్తున్న ఎన్నారైలు ఘనంగా జరుపుకోవాలని ఒక ప్రకటనలో సూచించారు. ఈ చారిత్రక సందర్భాన కేసీఆర్ పోషించిన కీలక భూమికను ప్రపంచానికి చాటాలని కోరారు.

నేటి నుంచి హైదరాబాద్‌లో ఎఫ్‌సీఐ జాతీయ హాకీ టోర్నమెంట్

- 20వ తేదీ వరకు పోటీలు..
- ప్రారంభించనున్న దక్షిణ జోన్ సీజీఎం రాజేష్ సింగ్

హైదరాబాద్, నవంబర్ 15 : భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) తెలంగాణ ప్రాంతం ఆధ్వర్యంలో 55వ అఖిల భారత అంతర్‌జోనల్ హాకీ టోర్నమెంట్ నవంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.ఆదివారం ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం, దక్షిణ మధ్య రైల్వే హాకీ గ్రౌండ్స్‌లో ప్రారంభోత్సవం జరగనుంది. ఎఫ్‌సీఐ దక్షిణ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ సింగ్ టోర్నమెంట్‌ను ప్రారంభించనున్నారు.ఐదు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎఫ్‌సీఐ క్రీడాకారులు పాల్గొననున్నారు. ఉద్యోగుల్లో క్రీడాస్ఫూర్తి, స్నేహభావం, ఐక్యత, జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందించడమే టోర్నమెంట్ లక్ష్యమని ఎఫ్‌సీఐ తెలంగాణ ప్రాంత జనరల్ మేనేజర్ అనుజ్ త్యాగి తెలిపారు.టోర్నమెంట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ప్రారంభోత్సవానికి ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు హాజరై విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

లాల్‌గడి మలక్‌పేటలో బట్టల గోదాంలో అగ్నిప్రమాదం

షార్ట్ సర్క్యూట్‌తో పాత బట్టల నిల్వ దగ్ధం.. తప్పిన ప్రాణనష్టం





హైదరాబాద్, నవంబర్ 15 :
జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట గ్రామంలో ఆదివారం బట్టల గోదాంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో గోదాంలో నిల్వ ఉంచిన పాత బట్టల స్టాక్ కాలిపోయింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించలేదు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం సుమారు 7.30 గంటల సమయంలో గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, జినోమ్ వ్యాలీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే చర్యలు చేపట్టి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.ఈ ప్రమాదంలో గోదాంలో నిల్వ ఉంచిన పాత బట్టల స్టాక్ దగ్ధమైంది. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టినట్లు జినోమ్ వ్యాలీ ఎస్‌హెచ్‌ఓ గురువయ్య గౌడ్ తెలిపారు.

ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల గోడుపట్టని సర్కార్

- బస్‌భవన్ చుట్టూ తిరుగలేక కోర్టులను ఆశ్రయించిన వైనం
- ఆర్పీఎస్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లు చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్



హైదరాబాద్, నవంబర్ 15 : తెలంగాణ ఆర్టీసీ సంస్థకు దశాబ్దాలపాటు నిస్వార్థంగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన వేలాది మంది కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షగట్టింది. వందలాది కోట్ల రూపాయల బకాయిలను విడుదల చేయకుండా వారిని గోస పుచ్చుకుంటున్నది. దీంతో ఆ కార్మికులంతా నేడు తీవ్ర నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. రిటైర్మెంట్ తర్వాత అందాల్సిన ప్రయోజనాల కోసం ఏండ్ల తరబడిగా వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. దాదాపు 20 వేల మంది రిటైర్డ్ కార్మికులు తమకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్థిక ప్రయోజనాలు అందకుండానే ఇప్పటికే 400 మందికి పైగా మరణించడం అత్యంత బాధాకరమని వారి కుటుంబాలు కన్నీటి పర్యంతమవుతున్నాయి. రిటైర్డ్ కార్మికులకు అందాల్సిన వేతన సవరణలు, డీఏలు, అలవెన్సులు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, వేతన బకాయిలు సహా అనేక ఆర్థిక ప్రయోజనాలను కొన్నేండ్లుగా నిలిపివేయడంతో వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాయి. హైదరాబాద్ బస్‌భవన్ చుట్టూ కాళ్లరిగేలా తిరుగాల్సిన దుస్థితి నెలకొన్నదని రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.తాము బతికి ఉండగానే తమకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అందుకొని అనుభవించేందుకు రిటైర్డ్ కార్మికులు న్యాయస్థానాలే శరణ్యమని నమ్ముకుంటున్నారు. సంస్థ అధికారులు పట్టించుకోక, ప్రభుత్వం నిర్లక్ష్యం తోడవడంతో కోర్టులే దిక్కు అని నమ్ముతున్నారు. తమకు రావాల్సిన డబ్బుల కోసం ఆర్టీసీ బస్‌భవన్ చుట్టూ తిరిగినా, ఆందోళనలు చేసినా సంస్థ యాజమాన్యం నుంచి స్పందన కరువైందని వారు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వానికి, ఆర్టీసీకి వ్యతిరేకంగా ప్రైవేట్ లాయర్లకు సొంత ఖర్చులు భరిస్తూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, ఆ అవకాశం రిటైర్డ్ కార్మికులందరికీ లేకపోవడంతో ప్రభుత్వం విడుదల చేసే డబ్బుల కోసమే ఎదురుచూస్తున్నారు. కోర్టుల్లో కేసులు వాదించినా కూడా సకాలంలో డబ్బులు విడుదల చేయలేని దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ ఆర్టీసీ సంస్థ ఉన్నదని కార్మిక నేతలు పేర్కొంటున్నారు.ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులకు సంస్థ చెల్లించాల్సిన బకాయిలన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆర్పీఎస్ స్కీమ్ నుంచి 2017 వేతన సవరణ బకాయిలు చెల్లించాలని, ఆర్పీఎస్ 2021 వేతన సవరణ బకాయిలూ అందలేదని చెప్తున్నారు. వేతన సవరణ అనంతరం పెరిగిన జీతాలకు అనుగుణంగా గ్రాట్యుటీ, టెర్మినల్ లీవ్ బెనిఫిట్స్, శాలరీ డిఫరెన్స్‌కూ దిక్కుమొక్కు లేకుండా పోయిందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఆర్పీఎస్ అమలు చేస్తే ఆ మేరకు వేతన బకాయిలపై రావాల్సిన పీఎఫ్ కాంట్రిబ్యూషన్‌ను కూడా వెంటనే జమ చేసి, అధిక పెన్షన్ పొందేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. తార్నాక ఆర్టీసీ దవాఖాన వైద్యసేవల పరిమితిని రూ.6 లక్షలకు పెంచాలని వారు కోరుతున్నారు.

ఓడిన రేవంత్ నిరంకుశత్వం

- ప్రభుత్వ మెడలు వంచి గెలిచిన పాలిటెక్నిక్ విద్యార్థులు
- పోలీసు దాష్టీకాలపై ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ డిమాండ్



హైదరాబాద్, నవంబర్ 15 : కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీవో 157తో సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చిన జీవో 97 తప్పు అని లిఖితపూర్వకంగా ఒప్పుకున్నట్టయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ తెలిపారు. తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రభుత్వ మెడలు వంచి గెలిచారని, సీఎం రేవంత్ నిరంకుశత్వం ఓడిందని పేర్కొన్నారు. జీవో 97 ద్వారా జరిగిన పోలీసు దాష్టీకాలపై ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని, విద్యార్థులు, అధ్యాపకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించాలని శనివారం ఒక ప్రకటనలో పేరొన్నారు.పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులకు సీఎం, విద్యాశాఖ మంత్రి రేవంత్‌రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్‌బీటీఈటీ, టీజీ ఈసెట్ లేటరల్ ఎంట్రీ, ఫీజులు, సాలర్ షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, సిబ్బంది సేవా నిబంధనలు, పాలిటెక్నిక్ భూములు, ఆస్తుల రక్షణపై లిఖితపూర్వక హామీ ఇవ్వాలని అన్నారు. ఇంటర్మీడియట్ రద్దు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, ఆ పదవికి తగిన సామర్థ్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తి ఉన్న పూర్తికాల విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు.

ఇరిగేషన్‌లో మరోసారి ఎక్స్‌టెన్షన్

- మ్రహబూబ్‌నగర్ సీఈ మళ్లీ కొనసాగింపు
- స్రర్కార్ నిర్ణయంపై ఇంజినీర్స్ అసోసియేషన్ల ఫైర్



హైదరాబాద్, నవంబర్ 15 : ఉద్యోగ విరమణ పొందిన ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతున్న సీఈకి ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించింది. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ కార్యదర్శి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్ సీఈగా ఏ సత్యనారాయణరెడ్డి గత ఏప్రిల్‌లో ఉద్యోగ విమరణ పొందారు. అనంతరం ఆయన సర్వీస్‌ను కాంట్రాక్టు పద్ధతిలో 6 నెలలపాటు ప్రభుత్వం పొడిగించింది. ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. తాజాగా మరో 6 నెలలపాటు సర్వీస్‌ను పొడిగిస్తూ ఇరిగేషన్‌శాఖ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. 2027 ఏప్రిల్ వరకు ఆయన కాంట్రాక్టు పద్ధతిలో సీఈగా కొనసాగనున్నారు. అదీగాక హైదరాబాద్ సీఈగా, హైడ్రా కమిషనరేట్‌లో సీఈగానూ ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.ఎక్స్‌టెన్షన్లను రద్దు చేయాలి.సర్కార్ తీరుపై ఇంజినీర్స్ అసోసియేషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నది. హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్, తెలంగాణ ఇరిగేషన్ గ్రాడ్యుయేట్ ఇంజినీర్స్ అసోసియేషన్, తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్, ఇరిగేషన్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశాయి. ఉద్యోగ విరమణ పొందిన సీఈకి మరో సారి 3 శాఖల్లో కొనసాగిస్తూ జారీ చేసిన ఆర్డర్‌ను వెంటనే రద్దు చేయాల ని డిమాండ్ చేశాయి. ఉద్యోగ విరమణ పొందిన ఇంజినీర్ల సర్వీస్‌ను పొడిగిస్తుండటం వల్ల జూనియర్ ఇంజినీర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయా సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభు త్వం తక్షణం ఎస్ఈలకు సీఈలుగా ప్రమోషన్లు కల్పించి ఖాళీలను భర్తీ చేయాల్సిందిపోయి, విమరణ పొందిన ఇంజినీర్లను నియమించడమేంటని నిలదీస్తున్నారు.

'ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యపై వస్తున్న ఆరోపణల వెనుక కార్పొరేట్ శక్తుల కుట్ర'

- బ్రీసీకి బీసీ సంఘాల సంపూర్ణ మద్దతు
- ఆరోపణలకు ఆధారాలు చూపాలి, నిరాధార ప్రచారం మానుకోవాలి
- బ్రీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్

హైదరాబాద్, నవంబర్ 15 :
ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యపై వస్తున్న ఆరోపణల వెనుక కార్పొరేట్ శక్తుల కుట్ర ఉందని బీసీ పొలిటికల్ ఫ్రంట్, గౌడ సంఘాల నాయకులు ఆరోపించారు.ఆయనను వైస్ ఛాన్సలర్ పదవి నుంచి తొలగించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీగా బాధ్యతలు నిర్వహిస్తున్న జానయ్యకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్లు అయిలి వెంకన్న గౌడ్, ఎలికట్టె విజయ్‌కుమార్ గౌడ్, బైరి శేఖర్, ఫ్రంట్ వైస్-చైర్మన్ ఎన్.దుర్గయ్య గౌడ్ మాట్లాడారు.విశ్వవిద్యాలయాల్లో సంస్కరణలు తీసుకురావడంతో పాటు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు జానయ్య కృషి చేస్తున్నారని తెలిపారు.ప్రభుత్వ విత్తన పరిశోధనలకు ప్రాధాన్యమిస్తూ, ప్రైవేటు విత్తన కంపెనీల ఒత్తిళ్లకు తలొగ్గకుండా పని చేస్తున్నందునే ఆయనపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వ్యక్తులు ఉన్నత పదవుల్లోకి వస్తే అడ్డంకులు సృష్టించడం దుర్మార్గమని పేర్కొన్నారు.జానయ్యపై ఆరోపణలు చేస్తున్న వారు వాటికి తగిన ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు.నిరాధార ఆరోపణలతో ఆయన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు.తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.జానయ్య ఒంటరివారు కాదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలు ఆయనకు అండగా ఉంటాయని స్పష్టం చేశారు.అవసరమైతే అన్ని సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఎంబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బడే సాబ్, బీసీ రచయితల సంఘం నాయకులు డా.ఆర్.శ్రీనివాస్, అమరవీరుల రాష్ట్ర సమితి అధ్యక్షులు సాయికుమార్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5.09 కోట్ల వ్యాపార మోసం.. మహిళపై లైంగిక వేధింపుల ఆరోపణలు

- పెళ్లి పేరుతో వంచించి లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు
- ముంబై నుంచి వచ్చిన జీరో ఎఫ్ఐఆర్‌తో ఆరుగురిపై కేసు

హైదరాబాద్, నవంబర్ 15 :
వ్యాపార లావాదేవీల పేరుతో ఓ మహిళను నమ్మించి రూ.5.09 కోట్ల మేర మోసానికి పాల్పడటంతో పాటు, పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికంగా వేధించినట్లు వచ్చిన ఫిర్యాదుపై పంజాగుట్ట పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం.. ముంబైకి చెందిన బాధితురాలు 'ది రాయల్ సింధ్' పేరుతో డ్రైఫ్రూట్స్ ట్రేడింగ్, బ్రోకరేజ్ వ్యాపారం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో 2024 జూలైలో హైదరాబాద్‌కు చెందిన మనీష్ భాటి ఆమెకు పరిచయమయ్యాడు. తొలుత వ్యాపార ఆర్డర్లు ఇచ్చి నమ్మకం పొందిన అనంతరం తన సోదరుడు పవన్ భాటి, స్నేహితుడు మహమ్మద్ రషీద్‌తో పాటు నదీమ్ జుమాని, జీషాన్ అహ్మద్, ఇర్ఫాన్ భాదాలను పరిచయం చేశాడు. వారికి బాధితురాలు సరుకులను అప్పుగా సరఫరా చేయగా, బకాయిలు చెల్లించకుండా తప్పించుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు మనీష్ భాటి తనకు వివాహం కాలేదని చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడని, పలుమార్లు హైదరాబాద్‌కు పిలిపించి తన ఇష్టానికి వ్యతిరేకంగా లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించింది. అంతేకాకుండా వీడియో కాల్స్ సమయంలో తీసిన అర్ధనగ్న చిత్రాలను వ్యాపారులకు పంపిస్తానని బెదిరిస్తూ, బకాయిలు అడిగిన ప్రతిసారీ వేధింపులకు గురిచేసినట్లు ఫిర్యాదులో తెలిపింది. మొత్తం రూ.5,09,81,914 మేర వ్యాపార బకాయిలు రావాల్సి ఉందని పేర్కొంది. ఈ మేరకు నవంబర్ 13న ముంబైలోని మహిమ్ పోలీస్ స్టేషన్ నుంచి వచ్చిన జీరో ఎఫ్ఐఆర్ ఆధారంగా పంజాగుట్ట పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంకితభావంతో చదివితే అద్భుతాలు సృష్టిస్తారు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి
- చింతల్ సెయింట్ మార్టిన్ పాఠశాల 28వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా



హైదరాబాద్, నవంబర్ 15 :
విద్యార్థులు చిన్ననాటి నుంచే అంకితభావం, క్రమశిక్షణతో చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ సాయినగర్‌లోని సెయింట్ మార్టిన్ పాఠశాల 28వ వార్షికోత్సవ వేడుకలు రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో పాటు మాజీ ఎన్నికల అధికారి వి. నాగిరెడ్డి, జూనియర్ కమిషన్డ్ వారెంట్ అధికారి సంతోష్ కుమార్, మల్లారెడ్డి విద్యా సంస్థల సలహాదారు డాక్టర్ చామకూర ప్రీతిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను సాధించాలని, చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు.పాఠశాల ప్రిన్సిపల్ రోహిణి రెమెల్లా మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి వార్షికోత్సవ వేడుకలు దోహదపడతాయని తెలిపారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. పాఠశాల బోర్డు సభ్యులు మర్రి లక్ష్మణరెడ్డి, జి. నరసింహ యాదవ్, జి. చంద్రశేఖర్ యాదవ్, జి. రాజశేఖర్ యాదవ్, జి. జై కిషన్‌యాదవ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

సంపాదకీయం

ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు వేగవంతం చేయాలి

నిర్వహణకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించేలా చూడాలని ప్రధానిని కోరినట్లు ఉత్తమ్ వెల్లడించారు.ఈ ప్రాంత ప్రాధాన్యతను పూర్తి గణాంకాలతో వివరించామని, అదనపు ముంపునకు సంబంధించి మహారాష్ట్రకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని స్పష్టం చేసినట్లు తెలిపారు. సమ్మక్క--సారలమ్మ బ్యారేజీ నిర్మాణానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి అవసరమైన నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) త్వరగా ఇప్పించాలని ప్రధానిని కోరినట్లు చెప్పారు. ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి ముంపు నివేదిక తెప్పించామని, అదనపు డీపీఆర్ కోసం కోరిన మొత్తాన్ని కూడా జమ చేశామని తెలిపారు. సమ్మక్క--సారలమ్మ డీపీఆర్‌ను సమర్పించిన నాటి నిబంధనల ప్రకారమే పరిశీలించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 16న కేంద్ర జల సంఘం చైర్మన్‌ను కలవనున్నట్లు, 17న ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రితో సీఎం రేవంత్‌రెడ్డి, తాను సమావేశం కానున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు.

సాగునీటి పథకాలకు రూ.5,856 కోట్ల ప్రతిపాదనలు

2027--28 ఆర్థిక సంవత్సరంలో ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన కింద నాలుగు సాగునీటి పథకాలకు రూ.5,856 కోట్ల నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు.

పథకం	కోరిన నిధులు
సీతమ్మసాగర్--సీతారామ సమీకృత పథకం	రూ.5,183 కోట్లు
మోడికుంట వాగు	రూ.392 కోట్లు
చిన్న కాళేశ్వరం	రూ.178 కోట్లు
చనాకా--కొరాట	రూ.103 కోట్లు
మొత్తం	రూ.5,856 కోట్లు

రాష్ట్రాలకు కేంద్రం ప్రకటించిన 50 ఏళ్ల వడ్డీలేని రుణాల కింద తెలంగాణకు ఇప్పటివరకు రూ.1,457 కోట్లు అందాయని ఉత్తమ్ తెలిపారు. 70 నుంచి 90 శాతం వరకు పనులు పూర్తయిన సాగునీటి ప్రాజెక్టుల తుది పనుల కోసం అదనంగా రూ.5 వేల కోట్ల నిధులు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు.ఈ నిధులు మంజూరైతే 2027 మార్చి 31లోగా వాటిని పూర్తిగా వినియోగించి, ఏడాదిలోగా కొత్త ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని వివరించారు.

భూగర్భ జలాల పెంపునకు రూ.5 వేల కోట్ల ప్రత్యేక సాయం

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం, రాష్ట్రంలో పడిపోతున్న భూగర్భ జలమట్టాలపై కూడా ప్రధానికి వివరించినట్లు ఉత్తమ్ తెలిపారు. కేంద్ర భూగర్భ జల మండలి సెప్టెంబర్ నివేదికను ప్రధానికి అందజేసినట్లు చెప్పారు.రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూగర్భ జలాల పెంపు, పరిరక్షణకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.5 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని కోరినట్లు వెల్లడించారు.వచ్చే వానాకాలం వరకు తాగునీటి అవసరాలకు సరిపడా నీటి నిల్వలను రిజర్వాయర్లలో ఉంచామని చెప్పారు.ప్రస్తుత పరిస్థితులనుదృష్టిలో పెట్టుకుని ఈయాసంగి సీజన్‌లో వరిసాగు చేయవద్దని రైతులకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ విజ్ఞప్తులపై ప్రధాని సానుకూల స్పందన

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించిన సాగునీటి ప్రాజెక్టులు, ఆర్థిక సాయం, పర్యావరణ అనుమతులు, భూగర్భ జలాల పరిరక్షణ అంశాలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లామని, తెలంగాణ విజ్ఞప్తులను పరిశీలిస్తామని ప్రధాని సానుకూలంగా స్పందించారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో మేడిగడ్డ బ్యారేజీ నుంచి నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాదని నిపుణులు స్పష్టం చేసినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఒకే తరహా సీకెంట్ పైల్ పునాదులు ఉన్నాయని, ఈ మూడు బ్యారేజీల పునాదుల రూపకల్పన, నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు నిపుణుల నివేదికలు పేర్కొన్నాయని వివరించారు.గత ప్రభుత్వ హయాంలోనే మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్నదని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడి నుంచి నీటిని ఎత్తిపోయాలని కోరడం అర్థరహితమని వ్యాఖ్యానించారు. ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టు కోసం గతంలో రూ.11 వేల కోట్లు ఖర్చు చేసి, 30 శాతం పనులు పూర్తయిన తర్వాత దానిని మేడిగడ్డ వైపు మళ్లించారని ఉత్తమ్ ఆరోపించారు. కమిషన్ల కోసమే గత ప్రభుత్వం ప్రాజెక్టును మళ్లించిందని విమర్శించారు.దిగువ ప్రాంతాల్లో దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నామని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు, నిధుల సాధనతో పాటు అంతర్రాష్ట్ర సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలి



సహాయ సహకారాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు.గతంలో ఎస్‌టీఎఫ్ ఆవిర్భావానికి కూడా ఇదే సామాజిక దృక్పథం పునాదిగా నిలిచిందని భట్టి గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉపాధ్యాయులు విద్యార్థుల కుటుంబాలకు, సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలనే ఆశయంతో ఈ సంఘం ఏర్పాటైందన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. వేలాది మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంతో పాటు సుమారు 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, 30 నుంచి 35 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టామని వివరిం చారు.ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తే వారు మరింత సంతృప్తితో విద్యాబోధనపై దృష్టి సారిస్తారనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోం దన్నారు.ప్రభుత్వ విద్యారంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని భట్టి తెలిపారు. ఒక్కో పాఠశాలను 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్లు చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా 105 పాఠశాలలకు ఒకేసారి అనుమతులు మంజూరు చేశామని, ప్రతి శాసనసభ నియోజక వర్గంలో కనీసం ఒక పాఠశాలను అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ సంకల్పమని వెల్లడించారు. నాణ్యమైన విద్యతో పాటు వసతి, క్రీడలు, ఇతర సహపాఠ్య కార్యక్రమాలు, బోధన, బోధనేతర సిబ్బందికి నివాస సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు.కుల, వర్గ విభేదాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాల పిల్లలు ఒకే ప్రాంగణంలో చదువుకునేలా ఈ పాఠశాలలను రూపొందిస్తున్నామని చెప్పారు. చిన్నతనం నుంచే సమానత్వ భావన పెంపొందించడమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు కుటుంబ వ్యవస్థలోని అనుబంధాలు, విలువలు కొనసాగాలనే ఉద్దేశంతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రారంభిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సెమీ రెసిడెన్షియల్ విధానంలో దాదాపు 100 పాఠశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.విద్యార్థులను ఉదయం ప్రభుత్వ రవాణా సదుపాయంతో పాఠశాలలకు తీసుకురావడంతో పాటు యూనిఫాం, బూట్లు, టై, పుస్తకాలు, బ్యాగులు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించి, సాయంత్రం క్రీడలు, ఇతర కార్యక్రమాల అనంతరం తిరిగి ఇళ్లకు పంపిస్తామన్నారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులతో సమయం గడుపుతూ కుటుంబ అనుబంధాలు, సామాజిక విలువలు నేర్చుకునే అవకాశం ఉంటుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందిస్తున్నామని భట్టి తెలిపారు. ఇందుకోసం పరిశుభ్రమైన కేంద్ర వంటశాలలను ఏర్పాటు చేశామని, ప్రతిరోజూ విభిన్నమైన అల్పాహారంతో పాటు పాలు, ప్రత్యామ్నాయ రోజుల్లో రాగిజావ అందిస్తున్నామని చెప్పారు.

తెలంగాణ ఆత్మగౌరవం ఢిల్లీకి తాకట్టు

సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిం చడం, రాహుల్‌గాంధీ బైక్ వెంట మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు పనివాళ్ల మాదిరిగా పరుగులు తీయడం అవమానకరమని మండిపడ్డారు. అమిత్‌షా కాళ్లు మొక్కుతూ, ఆయన వెంట పరుగెడుతూ, చెప్పులు తీసుకెళ్లిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ప్రవర్తనను చూసి తెలంగాణ ప్రజలు అసహ్యించుకున్నారని చెప్పారు. ఢిల్లీ పార్టీల రాష్ట్ర నాయకుల వ్యవహారశైలి సిగ్గుచేటంటూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఆవిర్భావమే ఆత్మగౌరవ పునాదులపై ఏర్పాటైందని గుర్తుచేశారు. ఆ రెండు జాతీయ పార్టీలకు ఆ విలువ ఎప్పటికీ అర్థంకాదని పునరుద్ఘాటించారు.

రైతుల హక్కుల కోసం ఎర్రజెండా పోరాట వారసత్వాన్ని కాపాడుకోవాలి





- మహిళా రైతులకు గుర్తింపు, భూసంస్కరణలు అమలు చేయాలని డిమాండ్

నల్లగొండ, నవంబర్ 15 : నల్లగొండ గడ్డపై జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వాన్ని మతతత్వ రాజకీయాలకు ఆపాదించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని మాజీ పార్లమెంట్ సభ్యురాలు, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ నాయకురాలు బృందా కారత్ పిలుపునిచ్చారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల హక్కుల కోసం కిసాన్ సభ తొమ్మిది దశాబ్దాలుగా పోరాడుతోందని పేర్కొన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల ప్రాంగణంలో 36వ అఖిల భారత కిసాన్ సభ మహాసభల సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ చారిత్రాత్మక మహాసభలకు హాజరైన రైతులు, ప్రతినిధులు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. జల్, జంగిల్, జమీన్ హక్కుల కోసం ఆయన సాగించిన పోరాటాన్ని స్మరించుకున్నారు. కిసాన్ సభ ఏర్పడిన నాటి నుంచి 90 ఏళ్లుగా ఎర్రజెండా రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల పక్షాన నిలిచిందని బృందా కారత్ అన్నారు. బ్రిటిష్ పాలకులు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో రైతాంగాన్ని స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములను చేసిన ఘనత కిసాన్ సభదేనన్నారు. కాశ్మీర్ నుంచి కేరళ వరకు, బెంగాల్‌లో తెభాగా పోరాటం నుంచి మహారాష్ట్రలో వార్లీ తిరుగుబాటు వరకు, దేశవ్యాప్తంగా జరిగిన రైతాంగ పోరాటాల్లో ఎర్రజెండా నాయకత్వం వహించిందని వివరించారు.నల్లగొండ జిల్లాలో నిజాం పాలనకు, భూస్వామ్య దేశ్‌ముఖ్‌ల దోపిడీకి, రజాకార్ల అండతో కొనసాగిన వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చరిత్రాత్మకమైందన్నారు. మూడు వేలకుపైగా గ్రామాలను భూస్వామ్య బంధనాల నుంచి విముక్తి చేసి, దున్నేవాడికి భూమి దక్కాలనే లక్ష్యంతో ఆ పోరాటం సాగిందని పేర్కొన్నారు. ఆ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమరయ్య, భూస్వామ్య శక్తులను ఎదిరించిన చాకలి ఐలమ్మ, పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం తదితరుల సేవలను స్మరించుకున్నారు. నాలుగు వేల మంది అమరవీరుల త్యాగాలను కొనియాడుతూ లాల్‌సలాం ప్రకటించారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. అది మతపరమైన పోరాటం కాదని, భూస్వామ్య దోపిడీ నుంచి రైతాంగాన్ని విముక్తి చేయడానికి సాగిన లౌకిక పోరాటమని స్పష్టం చేశారు. ఆ పోరాట వారసత్వాన్ని మతతత్వ రాజకీయాల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్య సంస్థలు, లౌకిక విలువలు, సమానత్వ సూత్రాలను బలహీనపరిచే విధానాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తోందని బృందా కారత్ విమర్శించారు. విదేశీ కంపెనీలు, కార్పొరేట్ సంస్థలు, పెద్ద వ్యవసాయ వ్యాపార సంస్థలకు అనుకూలంగా వ్యవసాయ విధానాలు రూపొందిస్తున్నారని ఆరోపించారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు సాగించిన పోరాటంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని గుర్తుచేశారు. అయినప్పటికీ రైతుల ప్రయోజనాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అన్నారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వల్ల వివిధ రంగాల రైతులకు నష్టం కలిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రైతులతో చర్చించకుండా ఇటువంటి ఒప్పందాలపై ముందుకు వెళ్లడం సరికాదన్నారు. ఆ ఒప్పందాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ పరిణామాలు, యుద్ధాల ప్రభావంతో ధరలు పెరుగుతున్నాయని చెబుతున్న ప్రభుత్వం, ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రేషన్ దుకాణాల ద్వారా బియ్యం, పప్పులు, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువులను సబ్సిడీపై అందించాలని కోరారు. దేశంలోని పలు ప్రాంతాల్లో రైతులు కరువు, వరదలతో తీవ్రంగా నష్టపోతున్నారని బృందా కారత్ అన్నారు. తెలంగాణలో కరువు పరిస్థితులు, పంట నష్టాలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. పంట నష్టానికి అందుతున్న పరిహారం సరిపోవడం లేదని, మరోవైపు బీమా కంపెనీలు లాభాలు పొందుతున్నాయని విమర్శించారు. రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని, బీమా సంస్థల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం గత 12 ఏళ్లలో దేశంలో లక్షన్నర వ్యవసాయ సంబంధిత ఆత్మహత్యలు నమోదయ్యాయని ఆమె ప్రస్తావించారు. వ్యవసాయ సంక్షోభం తీవ్రతకు ఇవి నిదర్శనమన్నారు. గ్రామీణ పేదలు, భూమిలేని కూలీలు, చిన్న రైతులకు ఉపాధి హామీ పథకం జీవనాధారంగా ఉండేదని, ఆ పథకాన్ని బలహీనపరిచే చర్యలు సరికావన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించి, కూలీలకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ విధానాలు అండగా నిలుస్తుండగా రైతులకు మాత్రం తగిన ప్రయోజనాలు అందడం లేదని బృందా కారత్ ఆరోపించారు. అదానీ వంటి కార్పొరేట్ సంస్థలు భారీ లాభాలు ఆర్జిస్తున్నాయని, రైతులకు ఏడాదికి రూ.6 వేల ఆర్థిక సాయం అందిస్తూ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. రైతులకు అందుతున్నది దానం కాదని, ప్రజాధనంతో అమలు చేస్తున్న పథకమని వ్యాఖ్యానించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, డీజిల్ ధరలను నియంత్రించాలని, విద్యుత్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. స్మార్ట్ మీటర్ల పేరుతో రైతులపై అదనపు భారం మోపవద్దన్నారు. దేశంలో భూమి పంపిణీలో అసమానతలు పెరుగుతున్నాయని బృందా కారత్ పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాల్లో భూమి కలిగిన కుటుంబాల మధ్య అసమానతలు తీవ్రంగా పెరిగాయని వివరించారు. అత్యధిక ఆదాయం కలిగిన 20 శాతం గ్రామీణ కుటుంబాల చేతుల్లో 75 శాతానికి పైగా భూమి కేంద్రీకృతమైందని, మరోవైపు ఐదు ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న చిన్న రైతులు వ్యవసాయ సంక్షోభంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అప్పుల భారం కారణంగా రైతులు భూములను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూగరిష్ట పరిమితి చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, భూమిలేని పేదలకు భూమి పంపిణీ చేయాలని, సమగ్ర భూసంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పనుల్లో సగానికి పైగా మహిళలు భాగస్వాములవుతున్నప్పటికీ వారికి రైతులుగా గుర్తింపు లభించడం లేదని బృందా కారత్ అన్నారు. మహిళలను ప్రభుత్వ రికార్డుల్లో కుటుంబ సహాయకులుగా పేర్కొనడం సరికాదన్నారు. వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళలకు భూమిపై హక్కులు కల్పించాలని, ప్రభుత్వ పథకాలు, విధానాల్లో సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మహిళా రైతులకు ప్రత్యేక గుర్తింపు కల్పించి, అన్ని ప్రభుత్వ పత్రాల్లో వారిని రైతులుగానే నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో లక్షలాది హెక్టార్ల సాగుభూమిని సేకరిస్తూ రైతులను నిర్వాసితులను చేస్తున్నారని బృందా కారత్ విమర్శించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం అందాల్సిన పరిహారాన్ని కూడా పలుచోట్ల నిరాకరిస్తున్నారని అన్నారు. ఈ ప్రక్రియలో ఆదివాసీలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అటవీ హక్కుల చట్టం అమలును విస్మరిస్తూ పోడు రైతులకు భూమి పట్టాలు ఇవ్వడం లేదని విమర్శించారు.తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామసభల అధికారాలను గౌరవించాలని, అటవీ హక్కుల చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలను ఆక్రమణదారులుగా పరిగణించి తొలగింపులకు పాల్పడవద్దని, అటవీ హక్కుల చట్టంతోపాటు సంబంధిత చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని బృందా కారత్ అన్నారు. అణచివేత ఉన్నచోట ప్రతిఘటన ఉంటుందని పేర్కొంటూ, రైతాంగ ఉద్యమాలకు సంఘీభావం తెలిపారు. ఎర్రజెండా కేవలం ఒక రాజకీయ గుర్తు కాదని, న్యాయం, సమానత్వం, శ్రమజీవుల దోపిడీ విముక్తి కోసం సాగుతున్న పోరాటానికి ప్రతీక అని అభివర్ణించారు.

ఎరుపెక్కిన నల్లగొండ

- ఎర్రజెండాల హోరు.. నినాదాల జోరు..
- రైతు మహాప్రదర్శనతో దద్దరిల్లిన నల్లగొండ.. ఎటుచూసినా ఎర్రసైన్యమే
- నాటి సాయుధ పోరాట స్ఫూర్తి.. నేడు రైతాంగ మహాప్రదర్శన రూపంలో ప్రతిధ్వని
- దింసా నృత్యాలు.. కోలాటాలు.. చెక్కభజనలు.. డీజే సప్పుళ్లు.. ఎడ్లబండ్ల సందడి

నల్లగొండ, నవంబర్15.



నల్లగొండ జిల్లా విప్లవాల ఖిల్లాగా వేరుగాంచిన నల్లగొండ జిల్లా కేంద్రం మరోమారు ఎర్రజెండాల రెపరెపలతో, రైతు నినాదాలతో ఎరుపెక్కింది. ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసిన ఖిల్లా... చరిత్రలో ఎన్నో ప్రజా పోరాటాలకు వేదికైన నల్లగొండ మరోసారి ఎర్రజెండాల రెపరెపలతో పులకించిపోయింది. అడుగడుగునా రైతాంగ ఉత్సాహం.. వీధివీధినా విప్లవ నినాదాల హోరు.. ఎటుచూసినా ఎర్రజెండాల సందడితో జిల్లా కేంద్రం అట్టుడికిపోయింది. అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభల సందర్భంగా నల్లగొండ పట్టణంలో ఆదివారం నిర్వహించిన రైతుల మహాప్రదర్శన అట్టహాసంగా సాగింది. వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నారు. ఈ మహాప్రదర్శనతో పట్టణ వీధులన్ని ఎర్రజెండాల రెపరెపలతో ఎరుపెక్కాయి. రైతాంగ ఐక్యతను చాటుతూ సాగిన ఈ మహాప్రదర్శనలో సంప్రదాయ కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆదివాసీల సంప్రదాయ దింసా నృత్యాలు అడుగడుగునా ఉత్సాహాన్ని నింపగా, కోలాటాల లయబద్ధమైన అడుగులు, చెక్కభజనల హోరు, డీజే సప్పుల దరువులతో పట్టణ వీధులు మారుమోగాయి. ఎర్రజెండాలు చేతబూనిన రైతులు, కార్మికులు, ప్రజాసంఘాల ప్రతినిధుల వినాదాలతో నల్లగొండ పురవీధులు ఉద్యమ గీతాన్ని ఆలపించాయి. ముఖ్యంగా కార్పొరేట్ శక్తుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా రూపొందించిన వినూత్న ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వ్యవసాయ రంగంపై కార్పొరేట్ పెత్తనాన్ని ప్రశ్నిస్తూ రూపొందించిన ప్రదర్శనలు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్లు చూపించాయి. మొత్తంగా రైతు మహాప్రదర్శనతో నల్లగొండ పట్టణం పండుగ వాతావరణాన్ని తలపించగా, ఎర్రజెండాల నినాదాలు, కళారూపాలు, రైతాంగ ఐక్యత అఖిల భారత రైతు సంఘం మహాసభలకు ప్రత్యేక ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి పురిటిగడ్డగా, భూమి కోసం భుక్తి కోసం సాగిన మహత్తర పోరాట చరిత్రకు సాక్షిగా నిలిచిన నల్లగొండ జిల్లా మరోసారి రైతాంగ ఉద్యమానికి నాంది. పలికేందుకు సిద్ధమైంది. ఒకప్పుడు పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన వీర తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తిని చాటుతూ నల్లగొండ పట్టణంలో నిర్వహించిన రైతాంగ మహాప్రదర్శన చరిత్రలో నిలిచిపోయేలా సాగింది. మర్రిగూడ బైపాస్ నుంచి ఎన్జీ కళాశాల వరకు సాగిన ఈ భారీ ప్రదర్శన రైతాంగ ఐక్యతను, పోరాట స్ఫూర్తిని చాటిచెప్పింది. సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రెండు గంటలకు పైగా సాగిన ఈ ప్రదర్శన పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఆదివాసీ, గిరిజనుల సంప్రదాయ నృత్యాలు, మహిళల కోలాటాలు, పురుషుల చిరుత భజన లు, డీజే సప్పులు, డప్పు చప్పుళ్లతో నల్లగొండ పట్టణం మార్మోగిపోయింది. ప్రదర్శనకు ముందు వరుసలో రెడ్ షర్ట్ వాలంటీర్లు నిర్వహించిన కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్రమశిక్షణతో సాగిన వారి కవాతు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఎడ్ల బండ్ల ప్రదర్శన గ్రామీణ రైతాంగ సంస్కృతిని ప్రతిబింబిస్తూ పట్టణ ప్రజల హృదయా లను దోచుకుంది. మరోవైపు కార్పొరేట్ శక్తులకు, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన గళం వినిపిస్తూ అంబా నీ, అదానీ, మోదీ పేర్లతో ఏర్పాటు చేసిన భారీ దిష్టిబొ మ్మను రైతులు దగ్ధం చేశారు. రైతుల సమస్యలు, కార్పొరేట్ ఆదిపత్యం, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై తమ నిరసనను చాటిచెప్పారు. అఖిల భారత రైతు సంఘం మహాసభల సందర్భంగా నిర్వహిం చిన రైతుల మహా ప్రదర్శన నల్లగొండ పట్టణంలో కనువిందు చేసింది. ఈ మహాప్రదర్శనలో ఆదివాసీల సంప్రదాయ దింసా నృత్యా లు,కోలాటాలు,చెక్కభజనలు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచా యి. ఎర్రజెండాలు చేతబూని రైతులు చేసిన నినాదాలతో నల్లగొండ పట్టణ వీధులు మారుమోగాయి. ఇక గ్రామీణ వ్యవసాయ సంస్కృతికి అద్దం పట్టిన ఎడ్లబండ్ల ప్రదర్శన సంప్రదాయ కళారూపాలు, రైతాంగ పోరాట స్ఫూర్తి కలగ లిసి మహాప్రదర్శనకు ప్రత్యేక శోభను తీసుకొచ్చింది. సం ప్రదాయాన్ని, రైతుల సంస్కృతి, గ్రామీణ జీవన విధానం, వ్యవసాయ వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ అలం కరించిన ఎడ్లబండ్లు వీధుల్లో సాగుతుంటే చూపరులు ఆసక్తిగా తిలకించారు.

హైదరాబాద్‌లో 55వ అఖిల భారత ఎఫ్‌సీఐ అంతర్‌జోనల్ హాకీ టోర్నమెంట్ ప్రారంభం రేపు

హైదరాబాద్, నవంబర్ 15 : భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) తెలంగాణ ప్రాంతం ఆధ్వర్యంలో 55వ అఖిల భారత అంతర్‌జోనల్ హాకీ టోర్నమెంట్ నవంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.టోర్నమెంట్ ప్రారంభోత్సవం నవంబర్ 16న ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం, దక్షిణ మధ్య రైల్వే హాకీ గ్రౌండ్స్‌లో జరుగుతుంది. ఎఫ్‌సీఐ దక్షిణ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ సింగ్ టోర్నమెంట్‌ను ప్రారంభించనున్నారు.ఐదు రోజుల పాటు జరిగే ఈ జాతీయ స్థాయి పోటీల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎఫ్‌సీఐ క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు.ఎఫ్‌సీఐ తెలంగాణ ప్రాంత జనరల్ మేనేజర్ శ్రీ అనుజ్ త్యాగి మాట్లాడుతూ, ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం, స్నేహభావం, ఐక్యత, జట్టుగా పనిచేసే తత్వాన్ని బలోపేతం చేయడం టోర్నమెంట్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. తెలంగాణలో ఈ ప్రతిష్ఠాత్మక క్రీడా వేడుక నిర్వహణకు అవకాశం కల్పించిన ఎఫ్‌సీఐ చైర్మన్, మేనేజిం

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

ధాన్యం రైతుకు యాప్ దగా!

- సర్కార్ తీరుతో వడ్లరాశులు దళారులపాలు
- విధి లేక అగ్గువకు అమ్ముకుంటున్న రైతులు



వరంగల్ ప్రతినిధి/కరీంనగర్, నవంబర్ 15 : మొన్నటిదాకా ఎల్ నినో సాకుతో సాగునీటికి గండికొట్టి రైతుల నడ్డివిరిచిన కాంగ్రెస్ సర్కార్.. ఇప్పుడు ఏకంగా ధాన్యం బోనస్ ఎగ్గొట్టాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది. ఏఐ ఆధారిత యాప్ పేర్కొన్నట్టు కేంద్రాలు నడిపితే రైతుకు రూ.500 ఇవ్వాల్సి వస్తుందని ఉద్దేశపూర్వకంగానే ధాన్యం కొనకుండా జాప్యం చేస్తున్నట్టు క్షేత్రస్థాయి పరిస్థితులను చూస్తే స్పష్టమవుతున్నది. నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రంలో నిర్దేశిత మౌలిక సౌకర్యాలు ఉండాలి. టార్పాలిన్లు, గన్నీ సంచులు, ధాన్యం నిల్వ స్థలాలు, కేంద్రం వద్ద రక్షణ గేటు, ధాన్యం రక్షణకు జాగ్రత్తలు, తేమశాతాన్ని నిర్ధారించే పరికరం, తూర్పార యంత్రం, వీటన్నింటినీ పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు తదితర సౌకర్యాల ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తేనే అనుమతి లభిస్తుంది.మొత్తం 16 ప్రశ్నలకు సమాధానాలను యాప్‌లో నమోదు చేస్తేనే కొనుగోలు కేంద్రం నిర్వహణకు అనుమతి లభిస్తుంది. లేకపోతే కొనుగోలు కేంద్రం లేనట్టేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిర్దేశిత సౌకర్యాలు కల్పించాలంటే ఖర్చుతోపాటు అందుకు అవసరమైన సాంకేతిక నిపుణత అవసరం. అవన్నీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమకూర్చుకునే అవకాశాలు తక్కువ అనే అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. అయితే, కొనుగోలు కేంద్రాలు ఓపెన్ చేస్తే రైతు నుంచి కొనుగోలు చేసిన ప్రతీ కింటాల్‌కు బోనస్ రూ.500 చెల్లించాల్సి వస్తుందని, ఆ బోనస్ ఎగవేతకు దగ్గరి మార్గమే కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక ముసుగు తొడిగి 16 రకాల ప్రశ్నలకు సమాధానాలు కావాలని కోరుతుందనే ఆరోపణలున్నాయి.దీంతో పంట చేతికొచ్చి నెల రోజులు గడిచినా ఇప్పటికీ వడ్లు కొనేవారు లేక అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. అక్కడక్కడ ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నేతలు అట్టహాసంగా కొనుగోలు ప్రారంభిస్తున్న కేంద్రాల్లో ఇప్పటివరకు ఒక్క గింజ ధాన్యం కొన్నది లేదు. ఇప్పటికే అకాల వర్షాలతో కొన్నిచోట్ల తడిసి ధాన్యం మొలకెత్తుతుండగా, అధికారులు మాత్రం రేపూమాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇదే అదనుగా దళారులు ఇష్టానుసారం ధరలు తగ్గించడంతో విధి లేక రైతులు తక్కువ ధరకే అమ్ముకొని నష్టపోవాల్సి వస్తున్నది. తమ రెక్కల కష్టాన్ని దళారుల పాలవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.సాధారణంగా అక్టోబర్ మొదటి వారంలోనే కోతలు ప్రారంభిస్తారు. రెండో వారంలో ముమ్మరమవుతాయి. ఆయకట్టు ప్రాంతంలో ముందు, ఆయకట్టేతర ప్రాంతంలో కొంత వెనుక కోతలు ఉంటాయి. ఈసారి కూడా అలాగే జరిగింది. దీనికి అనుగుణంగా కోతల వెంట కొనుగోలు అన్నట్టు ముందస్తు కోతలు వచ్చిన ప్రాంతాల్లో అధికారులు కేంద్రాలు ప్రారంభించి అక్టోబర్ రెండో వారం నుంచే కొనుగోళ్లు మొదలు పెట్టేవారు. కానీ ఈసారి ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఇప్పటివరకు కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. కరీంనగర్, కొత్తపల్లి, గంగాధర, రామడుగు, చొప్పదండి తదితర మండలాల్లో అక్టోబర్ మొదటి వారంలోనే కోతలు జరిగాయి. కేంద్రాలకు ఇబ్బడి ముబ్బడిగా ధాన్యం వచ్చింది. నెల రోజుల నుంచి రైతులు తమ ధాన్యాన్ని ఎఫ్‌ఏక్యూ నిబంధనల ప్రకారం తేమ 17శాతం వచ్చే వరకు ఆరబెట్టుకొని ఎప్పుడు కొనుగోలు చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు 310 కేంద్రాలను తెరిచినా ఒక్క క్వింటా ధాన్యం కూడా ప్రభుత్వం కొనలేదు. ఒకవైపు అకాల వర్షాలు కురిసి పూర్తిగా ఎండిన ధాన్యం తడిసిపోతున్నది. కొందరివి మొలకలు కూడా వచ్చాయి. కానీ ప్రభుత్వం మాత్రం కనికరించడం లేదు. ఇక వరంగల్ జిల్లావ్యాప్తంగా 201 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అవి ప్రారంభం కాలేదు.

2028 నాటికి నెల్లూరు మోడల్ సిటీ : మంత్రి నారాయణ

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు: నారాయణ
- 20 కోట్లతో అంతర్జాతీయ ప్రభుత్వ పాఠశాల
- మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం: మంత్రి నారాయణ
- ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుస్తున్నాం: నారాయణ
- అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ పనుల పరిశీలన





అమరావతి, నవంబర్ 15 : నెల్లూరులో ప్రభుత్వ విద్యారంగం రూపురేఖలు మారిపోతున్నాయి.. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా, అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే దిశగా మంత్రి నారాయణ వేగంగా అడుగులు వేస్తున్నారు. నెల్లూరు పరమేశ్వరి నగర్‌లో వక్ఫ్ బోర్డు స్థలంలో 20 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ పనులను మంత్రి నారాయణ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రికి టీడీపీ నేతలు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. వచ్చే విద్యాసంవత్సరంలోనే స్విమ్మింగ్ పూల్ వంటి అత్యాధునిక సదుపాయాలతో ఈ స్కూల్‌ను ప్రారం భిస్తామని మంత్రి ప్రకటించారు. ఇక 2028 చివరికల్లా నెల్లూరుని దేశంలోనే మోడల్ సిటీగా నిలబెడతామని మంత్రి నారాయణ తెలి యజేశారు..మంత్రి నారాయణ మాట్లాడుతూ యువనేత నారా లోకేష్ ఆలోచనలకు అనుగు ణంగా, విఆర్సీ స్ఫూర్తితో దాతల సహకారంతో ఆర్ఎస్ఆర్, డీఎస్ఆర్ హైస్కూల్స్‌ను అద్భుతంగా తీర్చిదిద్దామని, ఒకదాన్ని మించి మరొకటి ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసి, తన కుమార్తె శరణికి ఆధునీకరణ పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించానని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంలో స్విమ్మింగ్ పూల్‌తో సహా అంతర్జాతీయ ప్రమాణాలతో అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రారంభిస్తామని, కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ హైస్కూల్స్‌ను ఇదే స్థాయిలో అభివృద్ధి చేస్తామని, తమది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని, చెప్పిన దానికంటే ఎక్కువ అభివృద్ధి చేసి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ 2028 చివరికల్లా నెల్లూరుని దేశంలోనే మోడల్ సిటీగా నిలబెడతానని స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, పేద పిల్లలకు విద్యను ఆస్తిగా ఇవ్వాలన్న సంకల్పంతో దేశంలో ఎక్కడా లేని విధంగా, నారాయణ విద్యాసంస్థల కంటే మిన్నగా ప్రభుత్వ స్కూల్స్ రూపురేఖలను మంత్రి నారాయణ మార్చేస్తున్నారని, నెల్లూరు సిటీని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతూ డిస్నీ వరల్డ్ తరహాలో ఎంటర్టైన్మెంట్‌కు కూడా ప్లాన్ చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేయర్-ఎలెక్ట్ రూప్ కుమార్ యాదవ్, కార్పొ రేటర్లు షేక్ షబానా బేగం, షేక్ కరీముల్లా, పఠాన్ ఎం.డి. జుబేర్ ఉద్దీన్ , షేక్ నజీమా, షేక్ షాహీనా, నాయకులు మైనుద్దీన్ భాయ్, జాఫర్ మరియు నౌషాద్ మరియు ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

బౌరంపేటలో భారీ అగ్నిప్రమాదం..

- ఐదు బస్సులు దగ్ధం
- రూ.1.35 కోట్ల ఆస్తి నష్టం.. పెట్రోల్ బంకు సిబ్బంది అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- మూడు ఫైర్ ఇంజన్లతో గంటల తరబడి శ్రమించి మంటల అదుపు





హైదరాబాద్, నవంబర్ 15 : దుండిగల్ మండలం బౌరంపేట గ్రామ పరిధిలోని సరిత బస్ గ్యారేజీలో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గ్యారేజీలో పార్క్ చేసిన ఐదు బస్సులు పూర్తిగా దగ్ధమయ్యాయి. బస్సులతో పాటు అక్కడున్న ఇతర సామగ్రి కూడా అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో సుమారు రూ.1.35 కోట్ల మేర ఆస్తి నష్టం జరిగినట్లు గ్యారేజీ యజమాని పిన్నమబడి రాజేష్ రెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి పనులు ముగించు కున్న గ్యారేజీ సిబ్బంది అక్కడే నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి 12.35 గంటల సమయంలో గ్యారేజీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా మంటలు వ్యాపించి బస్సులకు అంటుకోవడంతో భారీగా అగ్నికీలలు ఎగసిపడ్డాయి. గ్యారేజీ పక్కనే పెట్రోల్ బంకు ఉండటంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది.అయితే పెట్రోల్ బంకు సిబ్బంది మంటలను గమనించి వెంటనే అప్రమత్తమయ్యారు. గ్యారేజీలో నిద్రిస్తున్న సిబ్బందిని నిద్రలేపి ప్రమాదం గురించి హెచ్చరించారు. అనంతరం అగ్నిమాపక శాఖ అధికారులకు, గ్యారేజీ యజమానికి సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించిన మూడు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పెట్రోల్ బంకు సిబ్బంది సకాలంలో స్పందించడం, అగ్నిమాపక సిబ్బంది వేగంగా చర్యలు చేపట్టడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన సమయంలో గ్యారేజీలో మొత్తం 11 బస్సులు పార్క్ చేసి ఉన్నట్లు బాధితుడు తెలిపారు. వీటిలో ఐదు బస్సులు పూర్తిగా కాలిపోయా యని, ఇతర సామగ్రి కూడా దగ్ధమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంతో సుమారు రూ.1.35 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు.విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే ప్రమాదానికి అసలు కారణాలు విచారణలో తేలాల్సి ఉంది. ఘటనపై సమగ్ర విచారణ జరిపి నష్టానికి గల కారణాలను గుర్తించాలని, బాధ్యులుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్యారేజీ యజమాని రాజేష్ రెడ్డి పోలీసులను కోరారు.

ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో అగ్రగామిగా తెలంగాణ

- డిజైన్, ఇంజినీరింగ్, నాణ్యతా పరీక్షలు, ధ్రువీకరణ, పరిశోధనపై ప్రత్యేక దృష్టి
- హైదరాబాద్‌లో ఎన్ డీఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సానుకూలం
- 'ఎన్‌డీఈ--2026' జాతీయ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు






హైదరాబాద్, నవంబర్ 15 : ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో తెలంగాణను దేశంలోనే అగ్ర గామిగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కేవలం తయారీ రంగానికే పరిమితం కాకుండా... డిజైన్, ఇంజినీరింగ్, నాణ్యతా పరీక్షలు, ధ్రువీకరణ, పరిశోధన తదితర విభాగాలనూ రాష్ట్రంలో మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఇండియన్ సొసైటీ ఫర్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (ఐఎస్ఎన్‌టీ) ఆధ్వర్యంలో ఆదివారం హైటెక్స్ లో నిర్వహించిన 'నాన్ డిస్ట్రక్టివ్ ఎవాల్యుయేషన్ అండ్ ఎనేబ్లింగ్ టెక్నాలజీస్ (ఎన్‌డీఈ--2026)' జాతీయ సదస్సులో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గ్లోబల్ సప్లై చైన్‌లో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌కు మరింత గుర్తింపును తీసుకొచ్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఆ దిశగా తయారీ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చుకునేలా స్థానిక పరిశ్రమలను గ్లోబల్ మార్కెట్ తో అనుసంధానం చేస్తున్నామన్నారు. విమానాలు, హెలికాప్టర్లు, ఇతర ఏరోస్పేస్, డిఫెన్స్ పరికరాల నాణ్యత, భద్రత, విశ్వసనీయతను నిర్ధారించడంలో ఎన్ డీఈ నిపుణుల పాత్ర కీలకమన్నారు. అడ్వాన్స్డ్ మెటీరియల్స్, ఎమర్జింగ్ టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్న కొద్దీ వాటిని పరీక్షించే విధానాలు కూడా మారాలన్నారు. మరింత కచ్చితమైన ఫలితాల కోసం ఏఐ, డిజిటల్ ట్విన్స్, అడ్వాన్స్డ్ ఇన్ స్పెక్షన్ పద్ధతుల వినియోగం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఎన్ డీఈ నిపుణులకు మరింత డిమాండ్ ఉండనుందని, ఆ దిశగా తెలంగాణ యువ తను 'రెడీ టూ వర్క్ ఫోర్స్' గా తీర్చిదిద్దేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేం దుకు ఐఎస్ఎన్ టీ, పరిశ్రమలు, యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థ లు ముందుకు రావాలని కోరారు. హైదరాబాద్‌లో ఎన్ డీఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలన్న ఐఎస్ఎన్ టీ విజ్ఞ ప్తిపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారు. ఇందు కు సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించాలని సూచిం చారు. కార్యక్రమంలో ఐఎస్ఎన్ టీ ప్రెసిడెంట్ డా.జైతీష్ ఆర్ జోషి, ఎన్ డీ ఈ 2026 ఛైర్మన్ సూర్య ప్రకాష్ గజ్జల, కన్వీనర్ మోహన్ పి నాయర్, మిధాని సీఎండీ డా.ఎస్వీఎస్ నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మురసు తుపాను నష్టాలపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు వర్చువల్ సమావేశం

- తక్షణమే రాష్ట్రానికి ఆర్థిక సాయం విడుదల చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి
- తుపాన్ల నష్టాన్ని శాశ్వతంగా తగ్గించేందుకు పటిష్టమైన మౌలిక సదుపాయాలు అవసరం: సీఎం
- మొత్తం రూ.2,484.43 కోట్ల నష్టం అంచనా.. 1.43 లక్షల హెక్టార్లలో పంటలకు నష్టం



అమరావతి, నవంబర్ 15 : మురసు తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటించిన ఏడుగురు సభ్యుల కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో వర్చువల్‌గా సమావేశమైంది. కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ చిత్రంజన్ దాస్ నేతృత్వంలోని ఈ బృందం రెండు బృందాలుగా విడిపోయి బాపట్ల, పల్నాడు, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించింది. దాదాపు 60 ప్రాంతాల్లో దెబ్బతిన్న పంట పొలాలు, కాలువలు, రహదారులు, ఇళ్లను పరిశీలించింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావానికి తోడు తక్కువ వ్యవధిలోనే రెండు తుపాన్లు రాష్ట్రాన్ని తాకడంతో భారీ నష్టం వాటిల్లిందని వివరించారు. తుపాను కదలికలను ముందుగానే అంచనా వేసి ప్రభుత్వం అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టిందన్నారు. తుపాను అనంతరం యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టి 24 గంటల్లోనే రహదారి రాకపోకలు, విద్యుత్ సరఫరా, మొబైల్ నెట్‌వర్క్ సేవలను పునరుద్ధరించినట్లు తెలిపారు.పంటలు నష్టపోయిన రైతులకు వీలైనంత త్వరగా బీమా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అదనపు రేషన్ సరుకులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం తరచూ తుపాన్ల బారిన పడుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో నష్టాలను కనిష్ఠ స్థాయికి తగ్గించేందుకు పటిష్టమైన, విపత్తులను తట్టుకునే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు.తుపాను నష్టాలపై కేంద్ర బృందం పది రోజుల్లోగా కేంద్రానికి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సహాయ, పునరావాస కార్యక్రమాల కోసం తక్షణమే ఆర్థిక సాయం విడుదల చేయాలని కేంద్రాన్ని కోరారు. క్షేత్రస్థాయి పరిశీలనలో గ్రామీణ రహదారులు భారీగా దెబ్బతిన్నాయని, ఆకస్మిక వరదల కారణంగా రహదారులపై తీవ్ర ప్రభావం పడిందని కేంద్ర బృందం వెల్లడించింది. విద్యుత్ స్తంభాలు కూడా పెద్ద సంఖ్యలో దెబ్బతిన్నాయని తెలిపింది. వాణిజ్య పంటలైన పత్తికి అధిక బీమా ప్రీమియం ఉండటంతో పలువురు రైతులు పంటల బీమా చేయించుకోలేదని పేర్కొంది. ప్రభుత్వం ముందస్తుగా కాలువలు, వాగుల్లో పూడిక తొలగించడం వల్ల నష్టం కొంతవరకు తగ్గిందని అభిప్రాయపడింది. గ్రామాల్లో పూరిళ్లు, శాశ్వతం కాని ఇళ్లు దెబ్బతిన్నాయని తెలిపింది. 30 రోజుల్లో మూడుసార్లు రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించింది. ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు ప్రీ-స్కూల్ యూనిఫాంలు అందించాలని పేర్కొంది.ప్రత్యేకంగా అత్యంత వెనుకబడిన గిరిజన తెగల (గ్రుఐ+o) కుటుంబాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, వారికి ప్రత్యేక సహాయం అందించాలని సూచించింది. సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అధిక పరిహారం అందించాలని అభిప్రాయపడింది.అర్నవ్ తుపానుతో పోలిస్తే మురసు తుపాను కారణంగా తూర్పుగోదావరి జిల్లాలో భారీ వర్షాలు కురిసి ఎక్కువ నష్టం వాటిల్లిందని కేంద్ర బృందం పేర్కొంది. తూర్పుగోదావరిలో వరి పంటకు 80 శాతం వరకు, ఏలూరు జిల్లాలో 90 శాతం వరకు నష్టం జరిగిందని అంచనా వేసింది. ఉద్యాన పంటల్లో మామిడి, బొప్పాయి తోటలు ఎక్కువగా దెబ్బతిన్నాయని వెల్లడించింది.

రూ.2,484 కోట్లకు పైగా నష్టం

రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బృందానికి సమర్పించిన నివేదిక ప్రకారం మురసు తుపాను వల్ల మొత్తం రూ.2,484.43 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసింది.

నష్టాల వివరాలు ఇలా ఉన్నాయి:

రహదారులు: 1,385 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయి. 36 ప్రాంతాల్లో గండ్లు పడగా, 65 కల్వర్టులు దెబ్బతిన్నాయి. మొత్తం నష్టం రూ.888.84 కోట్లుగా అంచనా.వ్యవసాయం: 1,43,617 హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో రూ.874.97 కోట్ల నష్టం వాటిల్లింది. 1,86,063 మంది రైతులు ప్రభావితమయ్యారు.ఉద్యాన పంటలు: 6,756 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లింది. రూ.337.10 కోట్ల నష్టం అంచనా వేయగా, 12,605 మంది రైతులు ప్రభావితమయ్యారు. సాగునీటి వనరులు: మొత్తం 369 సాగునీటి వనరులు దెబ్బతిన్నాయి. 509 ప్రాంతాల్లో గండ్లు ఏర్పడ్డాయి. గ్రామీణ రహదారులు: 220 కిలోమీటర్ల మేర 114 రహదారులు దెబ్బతిన్నాయి. విద్యుత్ రంగం: 10,192 పదకొండు కేవీ విద్యుత్ స్తంభాలు, 6,442 ఎల్‌టీ స్తంభాలు, 1,448 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి.గృహాలు: మొత్తం 3,859 ఇళ్లు దెబ్బతినగా, వాటిలో 645 గుడిసెలు ఉన్నాయి.సహాయక చర్యలు: అత్యవసర స్పందన, సహాయక చర్యల కోసం రూ.37 కోట్ల వ్యయం జరిగినట్లు అంచనా.వైద్య, ఆరోగ్య, మత్స్య, పురపాలక, మహిళా శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, తాగునీరు, పాఠశాల విద్య, పశుసంవర్ధక, చేనేత తదితర రంగాల్లోనూ నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బృందానికి వివరించింది. తుపాను నష్టాలపై కేంద్ర బృందం సమర్పించే నివేదిక ఆధారంగా రాష్ట్రానికి కేంద్ర సాయం అందుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

బలగ TV BALAGAM

balagamtv100@gmail.com

60 ఏళ్ల తర్వాత చందనోత్సవం..





- కొండగట్టులో మానాల అయ్యప్ప స్వాముల ప్రత్యేక పూజలు.!

బలగం టీవీ, రుద్రంగి :

రుద్రంగి మండలంలోని మానాల గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాముల బృందం 60 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న చందనోత్సవం, అంకురార్పణం, మహా సంప్రోక్షణం సందర్భంగా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి మానాల గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆంజనేయస్వామిని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. స్వామివారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తుమ్ జలపతి, కొక్కుల వంశీ, చెదలు నవీన్, తుమ్ తిరుపతి,యాసోజీ అభి, తుమ్ శ్రీనివాస్, తుమ్ గంగాధర్, భూపతి, నర్సన్న తదితర అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

కళాకారులను కించపరిస్తే సహించేది లేదు



- రాజు బోడపై చర్యలు తీసుకోవాలి..
- మధుప్రియ, శివజ్యోతిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ డీఎస్పీ, టౌన్ సీఐకి ఫిర్యాదు.
- సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సత్తార్ హెచ్చరిక..

బలగం టీవీ, సిరిసిల్ల :

కళాకారుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా మాట్లాడితే సహించేది లేదని తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సత్తార్ హెచ్చరించారు. సింగర్ మధుప్రియ, యాంకర్ శివజ్యోతిపై అమెరికాలో నివసిస్తున్న ఎన్నారై రాజు బోడ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారంలో ఉన్న నేపథ్యంలో, ఈ వ్యవహారంపై డీఎస్పీ, టౌన్ సీఐకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫోక్ ఇండస్ట్రీ ప్రచార కార్యదర్శి ఆకునూరి దేవయ్య, శ్రీరామ్ రామచంద్రం, విశ్వరాజు మహేష్, సాంబారి నవీన్, కాయితోజు ప్రవీణ్, నక్క శ్రీకాంత్, వేముల సతీష్, శ్రీరామ్ మహేందర్, పులి శ్రీనివాస్, సాంబారి రాజు తదితర కళాకారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ సీఈకి ఇచ్చిన మూడు పోస్టుల ఎక్స్‌టెన్షన్ ఉత్తర్వులు రద్దు చేయాలి

హైదరాబాద్, నవంబర్ 15 : నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి ఆదేశాల మేరకు ఒక పదవీ విరమణ పొందిన చీఫ్ ఇంజనీర్లకు ఇంజనీర్ ఇన్ చీఫ్ లకు తిరిగి పదవీ పొడిగింపులు ఇవ్వడం వల్ల జూనియర్ ఇంజనీర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోంది.ప్రభుత్వము చీఫ్ ఇంజనీర్ క్యాడర్‌లో వరుసగా ఎస్.ఈ.లకు ప్రమోషన్లు కల్పించి, ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయాల్సిందిపోయి, ప్రభుత్వం రిటైర్ అయిన ఇంజనీర్లనే తిరిగి అదే క్యాడర్ పోస్టుల్లో నియమిస్తోంది. దీనివల్ల పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు ఐదు క్యాడర్లలో ఇంజనీర్ల ప్రమోషన్ అవకాశాలు దెబ్బతింటున్నాయి.ఎస్.ఈ.లుగా ఉన్నప్పుడు ఎక్స్‌టెన్షన్‌ల కారణంగా సరైన సమయంలో ప్రమోషన్లు పొందలేకపోయిన వారే, సి.ఈ.లుగా ఇంజనీర్ ఇన్ చీఫ్ లుగా పదవీ విరమణ అనంతరం కూడా తిరిగి ఎక్స్‌టెన్షన్‌ల కోసం ప్రయత్నించడం ఆందోళన కలిగించే విషయం. ప్రభుత్వం ఎక్స్‌టెన్షన్లను రద్దు చేస్తామని గతంలో పలు సార్లు హామీలు ఇచ్చినప్పటికీ, వాటిని ప్రభుత్వమే ఉల్లంఘిస్తూ ఎక్స్‌టెన్షన్లు ఇవ్వడం కొనసాగిస్తోంది.ఈ సమస్య అన్ని ఇంజనీరింగ్ శాఖల్లో ఉన్నప్పటికీ, సాగునీటి శాఖలో ఇది తీవ్రమైన సమస్యగా మారింది. ఇప్పటికే సాగునీటి శాఖలో పలువురు ఇంజనీర్ ఇన్ చీఫ్ / చీఫ్ ఇంజనీర్ లకు (అదనంగా ఒక్కటో రెండో పోస్టని కూడా అనగా రిటైర్ అయినా వారికీ మూడు సి ఈ పోస్టు లేక ఒక్క సి ఈ, ఒక్క యస్ ఈ పోస్టతొ)పదవీ పొడిగింపులు ఇస్తున్నది, నిన్ననే ఒక్కసారి ఇచ్చిన జజు గారికి మూడు జజు పోస్టుతో మరో ఆరునెల్లు ఎక్సటెన్షన్లు ఇచ్చి కనీసము పదుగురు రాజు లకు జజు ప్రమోషన్ రాకుండా వాళ్ళు Se లుగానే రిటైర్ అయ్యేలా చేస్తున్న ప్రభుత్వం ఇంకా ఈ నెలలో పదవీ విరమణ చేయబోతున్న ఒక్క సి.ఈ. కూడా ఎక్స్‌టెన్షన్ల కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.నిన్న ఇచ్చిన మూడు జజు పోస్టు లకి ఒక్క జజు ని ఎక్సటెన్షన్ గా ఇచ్చిన ఆర్డర్స్ ని వెంటనే రద్దు చేసి ఇప్పటికే ఇచ్చిన ఎక్స్‌టెన్షన్లను కూడా రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అదే సమయంలో, తోటి ఇంజనీర్‌లకు అన్యాయం చేసే విధంగా ఎక్స్‌టెన్షన్ల కోసం ప్రయత్నిస్తున్న వారికి కూడా విజ్ఞప్తి చేద్దాం. ఎక్స్‌టెన్షన్ తెచ్చుకుని సి.ఈ/ఇంజనీర్ ఇన్ చీఫ్ గా వచ్చినా, సహాయ నిరాకరణ వంటి ప్రజాస్వామ్య పద్ధతులతో నిరసన తెలియజేస్తాము.మీరు మా మనస్సుల్లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య, నవాజ్ జంగ్ ల వంటి మహనీయుల వారసులుగా మిగులుతారా? లేక ఎక్సటెన్షన్ వీరులుగా మిగులుతారా? అని ప్రతి ఒక్కరినీ నిలదీస్తాం. జవీ పాత ప్రభుత్వం ఇచ్చిన ఎక్సటెన్షన్స్ రద్దు చేసి, మాకందరికి ఒక్క అన్నా లాగా 2025 లో ఇంకా ఎవరికీ ఎక్సటెన్షన్లు ఇవ్వమని మాట ఇచ్చి నిన్ననే ఒక్క ఎవ గారికే మూడు ఎవ పోస్టు ఇవ్వడం దారుణం, ఇట్టి ఆర్డర్స్‌ని వెంటనే రద్దుచేసి,అర్హులైన Seలకు వారు రిటైర్ కాకముందే జజు లుగా ప్రమోషన్‌లు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము, లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు చేపట్టుతాం.

సమ్మిట్‌తో ప్రజలకు ఒరిగింది ఏమిటి?

ఉపాధి అవకాశాలపై సమగ్ర నివేదిక విడుదల చేయాలి

మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 15 : రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నా, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నా తెలంగాణ ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేదని పదేపదే చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్లోబల్ సమ్మిట్ రూ.50 కోట్లు ఎలా ఖర్చుచేశారని మాజీ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ప్రశ్నించారు. కరువు పరిస్థితుల్లో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ కోసం రూ.50 కోట్లు ఖర్చు చేయడంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఆమె మీడియాతో మాట్లాడారు.ప్రజాధనంతో అంతర్జాతీయ సదస్సు నిర్వహించడంవల్ల రాష్ట్ర ప్రజలకు కలిగిన ప్రయోజనాలేమిటని ప్రశ్నించా రు. ఈ సదస్సు ద్వారా ఎన్ని దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు? ఎన్ని పెట్టుబడులొచ్చాయి? ఎన్ని పరిశ్రమలు రానున్నాయి? ఎంతమందికి ఉపాధి దొరుకుతుంది? అనే వివరాలను ప్రభు త్వం సమగ్ర నివేదిక రూపంలో ప్రజల ముందు ఉంచాలని పేర్కొన్నారు.

ఎల్లమ్మ తల్లి పంచామృత అభిషేకంలో పాల్గొన్న ప్రముఖులు

- సిద్ధోగం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.

ఎల్లారెడ్డిపేట బలగం టీవీ

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి సిద్ధోగం, నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారికి నిర్వహించిన పంచామృత అభిషేక మహోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, ఆయన సతీమణి హైమావతి దంపతులు, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు, ప్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలగందుల నర్సింలు, పందిళ్ల పరిశ్రమల ప్రతినిధి బాలా గౌడ్ తదితరులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.అమ్మవారికి నిర్వహించిన పంచామృత అభిషేకంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామం సుభిక్షంగా, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.





ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట

- 31వ వార్డులో అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించి పనులు ప్రారంభించిన: మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఆదివారం రోజున స్థానిక 31వ వార్డులో చేపట్టనున్న సీసీ మురికి నీటి కాలువ (మోరీ) నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి భూమిపూజ కార్యక్రమం నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ.. 31 వ వార్డులో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా ఈ మురికి నీటి కాలువ సమస్యను కౌన్సిలర్ పాశికంటి రమ్య సత్యనారాయణ మా దృష్టికి తీసుకురాగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తు 3 లక్షల రూపాయల మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో ఈ పక్క సీసీ మురికినీటి కాలువ నిర్మాణ పనులు ఆదివారం రోజు చేపడుతున్నట్లు తెలిపారు..ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పాలకవర్గ సభ్యుల అందరితో చర్చిస్తూ సిరిసిల్ల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు.



అదేవిధంగా ఇట్టి మురికినీటి కాలువ నిర్మాణ పనులను మంచి నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్ కు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్ సభ్యులు పాశికంటి రమ్య సత్యనారాయణ, దొంతునేని కళ్యాణి అశోక్ రావు , గుండ్లపల్లి నీరజ పూర్ణచందర్, ఎలుక వెంకటేశం , అడిచెర్ల రూప సాయి కృష్ణ , గెంట్యాల శ్యామల శ్రీనివాస్ , కొండ వర్షిని నరేష్ , బత్తుల రమేష్ , మున్సిపల్ అధికారులు దీ=నా పార్టీ నాయకులు బింగి ఇజ్జగిరి, పాశికంటి లవన్ కుమార్, కమలాకర్ మరియు ప్రజలు పాల్గొన్నారు.